క్లుప్తంగా

లలితాదేవికి ప్రత్యేక పూజలు


లలితాదేవి అమ్మవారి విగ్రహం

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం పంచాయతీ కుంచాల కుర్మయ్యపేట గ్రామంలోని లలితాదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు వంశీకుమార్‌శర్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు అంకురార్పణ


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

రణస్థలం: దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల నిర్వహణకు మండల కేంద్రంలోని జే.ఆర్.పురం గ్రామస్తులు ఆదివారం అంకురార్పణ చేశారు. గ్రామ పురోహితులు దర్భముళ్ల శ్రీనివాస శర్మ మండపం ఏర్పాటు స్థల పరిశీలన చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

గురజాడకు ఘనంగా నివాళి


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్‌లో గురజాడ జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గురజాడ చిత్రపటానికి నివాళులర్పించారు. గురజాడ గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. తెలుగు భాషా అధ్యాపకురాలు ఉషారాణి, అధ్యాపకులు కె.తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులపై ఆరా తీస్తున్న రాజేంద్రప్రసాద్

జి.సిగడాం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన అందరి సహకారంతోనే సాధ్యమని మండల పరిషత్ ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సర్వేశ్వరపురం, ముషినివలస, జాడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఆదివారం పరిశీలించారు. గ్రామాల్లో అంటురోగాలు రాకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే మురుగు కాలువల్లోని పూడికల తీత, తాగునీటి బోర్ల వద్ద క్లోరినేషన్ చేయడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బందిని కూడా అప్రమత్తం చేశామన్నారు. ఎక్కడైనా డయేరియా, జర్వాలు ఉంటే తక్షణమే సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేటలో పారిశుద్ధ్య పనులు


కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం గ్రామ పంచాయతీ బలిజిపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కాలువల్లో ఉన్న చెత్తను తొలగించారు. రహదారులను శుభ్రం చేశారు. సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ పర్యవేక్షించారు.

రహదారిపై మట్టిని తొలగించాలి


రోడ్డుపై పేరుకుపోయిన మట్టి పార

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి వద్ద సర్వీస్ రోడ్డుపై మట్టి పొరలు పేరుకుపోయాయి. మట్టిపై నుంచి వాహనాలు జారుతున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై మట్టి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


అంధకారంలో శ్రీకాకుళం వీధులు!

- వెలగని విద్యుత్ దీపాలు
- చీకట్లోనే ప్రధాన రహదారులు, కాలనీలు
- ఇబ్బందులు పడుతున్న నగరవాసులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని పలు వీధులు, కాలనీలు అంధకారంలో ఉన్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు సాయంత్రమైతే చీకటితో సావాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నగరం నడిబొడ్డున ఉన్న కిమ్స్‌రోడ్డు, కొత్త వంతెన, రిమ్స్ ఆస్పత్రి రోడ్డు, పాలకొండ రోడ్డు, అరసవల్లి, పీఎన్‌కాలనీలో పలు లైన్లు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, వాంబేకాలనీ, బలగ, ఆదివారంపేట, హయాతీనగర్, ఫాజుల్‌బాగ్, కొత్తపేట, పెద్దపాడు, డీసీసీబీ కాలనీ, విశాఖ-ఏ, విశాఖ-బీ కాలనీలతో పాటు విలీన పంచాయతీ శివారు ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో విద్యుత్‌వీధి దీపాలు వెలగం లేదు. దీంతో ప్రజలు సాయంత్రమైతే రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. వర్షాకాలం కావడంతో విషసర్పాలు, కీటకాలు రోడ్లపైకి వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు ట్యూషన్లకు, స్కూళ్లకు వెళ్లి రావడానికి, రాత్రి సమయంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిమ్స్ ఆస్పత్రి రోడ్డుతో పాటు పలు ప్రధాన రహదారుల్లో సైతం లైట్లు వెలగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రిమ్స్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు రూ. 27 లక్షలు, సెంట్రల్‌లైటింగ్‌లో రోప్ వెలుగుల కోసం రూ. పది లక్షలు వెచ్చించి విద్యుత్‌కాంతులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అందించారు. రిమ్స్‌కి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. వీరంతా రాత్రి వేళల్లో అత్యవసర సమయంలో బయటకు వెళ్లి రావాలంటే భయపడే పరిస్థితి నెలకుంది. ఇటీవల రిమ్స్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద దొంగతనం కూడా జరిగింది. ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్‌కి పక్కనే అర్‌కేనగర్‌లో వాకింగ్‌కు వెళ్లి వస్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడును చైన్‌స్నాచర్లు తెంచుకొని పరారయ్యారు. కార్పొరేషన్‌లో నివసిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతంలో ఉన్నట్లుగా ఉందని ప్రజలు వాపోతున్నారు. నగరంకంటే పల్లెటూరే నయమనిపిస్తోందని చెబుతున్నారు. చీకటి కారణంగా మహిళలు ఒంటరిగా రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే ఈ సమస్య నెలకొందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త లైట్లు వేయడం, మరమ్మతులు చేపట్టి అంధకారం నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


రిమ్స్‌రోడ్డులో వెలగని లైట్లు




చీకట్లో కొత్తవంతెన


వెలగని లైట్లు

చర్యలు చేపడతాం



నగరంలో ఎక్కడెక్కడ లైట్లు పాడైయ్యాయో తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. మరమ్మతులు చేయాల్సిన అన్ని చోట్ల ఎప్పటికప్పుడు బాగు చేస్తున్నాం. విద్యుత్‌లైట్లు అన్ని బాగుచేసి నగరాన్ని వెలుగుల్లో ఉంచుతాం.

– పి.వి.వి.డి.ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

చీకటిలోనే ఉంటున్నాం



రిమ్స్ రోడ్డు అంతా అంధకారంలో ఉంటుంది. సెంట్రల్ లైటింగ్ పూర్తిగా పనిచేయడం లేదు. ఒక రోజు వెలిగితే నాలుగు రోజులు చీకటిలోనే ఉంటున్నాం. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ప్రభుత్వ హయాంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో పూర్తిగా లైట్లు పాడైపోయి చీకటి మయంగా ఉంది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

– గంధం నరేష్, రిమ్స్ ఆస్పత్రి రోడ్డు, శ్రీకాకుళం

పట్టించుకున్నవారే కరువయ్యారు



అరసవల్లిలో చాలా వీధుల్లో చీకటిగా ఉంటున్నాయి. విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయాలని చెబుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. చీకటిగా ఉండడంతో కుక్కలు మీదకొచ్చేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. లైట్లు ఏర్పాటు చేసి అంధకారం నుంచి రక్షించాలి.

– పూజారి ఆనందరావు, అరసవల్లి

కషాయాలతో తెగుళ్ల నివారణ

ఎచ్చెర్ల: ఉడుకు తెగుళ్లు రాకుండా పంటలో కషాయాలను వాడాలని ప్రకృతి వ్యవసాయం తమ్మినాయుడపేట యూనిట్ ఇన్‌చార్జి చంద్రకళ తెలిపారు. ఆదివారం కొత్తపేట గ్రామంలో పంటలకు ఉడుకుతెగుళు సోకడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. దీని వారణకు వావిలాకు, తూటికాడ కషాయం తయారుచేశారు. రాజీలేని సూత్రాల్లో భాగంగా పసుపు, తెలుపు ప్లేట్లు, లింగాకర్షక బుట్టలు పెట్టుకుని తద్వారా తెగుళ్లు, పురుగులు గమనించి సరైన సమయంలో కషాయాలను వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

29న కనకధారా స్తోత్రంపై ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈనెల 29న ధారణకర్త, పౌరాణిక ప్రవర్త డాక్టర్ బాచుపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రిచే కనకధారా స్తోత్రంపై ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ఈ ప్రవచనం ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతోందన్నారు.

రక్తదానం.. ప్రాణదానం..


రక్తదానం చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులతో ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌వీసీ రామాంజనేయ థియేటర్ దగ్గర టీమ్ తారక్ ట్రస్ట్ తరఫున జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు దేవరా చిత్రం విడుదల సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 140 యూనిట్ల రక్తాన్ని సేకరించి శ్రీకాకుళం విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. టీమ్ తారక్ ట్రస్ట్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయానికి 'ప్రసాద్' పథకం వర్తింపు


అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయానికి 'ప్రసాద్'(పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగుమెంటేషన్ డ్రైవ్) పథకాన్ని వర్తింప చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించారు. ఆదివారం ఆయన అరసవల్లి ఆలయంలో ప్రసాదాల విభాగాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లడ్డూ, అన్నప్రసాదాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయానికి మరింత ఖ్యాతి వచ్చేలా.. భక్తులకు ఆధునిక సౌకర్యాల కల్పన కోసం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుల ప్రోత్సాహంతో కోట్లాది రూపాయలతో 'ప్రసాద్'స్కీంను అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా భక్తులకు అత్యాధునిక సౌకర్యాల కల్పన, మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ కమిటీని కూడా వేశామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. అన్నదాన, లడ్డూ ప్రసాదాలను స్వయంగా రుచి చూశానని.. అంతా బాగుందన్నారు. లడ్డూ విషయంలో కొన్నేళ్ల నుంచి ఇక్కడ విశాఖ డెయిరీ ఆవు నెయ్యిని వినియోగిస్తుండడంతో రుచిగా, నాణ్యతగా ఉందన్నారు. అయితే కిచెన్‌ను మాత్రం ఆధునికరించాల్సి ఉందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, దీనిపై విచారించి దోషులకు కఠిన శిక్షలు వేయాలని కోరుతున్నామన్నారు. స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులు ఉంగటి వెంకటరమణమూర్తి, రాయిపల్లి అర్జున్, పూడి తిరుపతిరావు, బి.రామ్మోహనరావు ఉన్నారు.

రద్దీగా ఆదిత్యుని సన్నిధి


సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని భక్తులు భారీగా ఆదివారం దర్శించుకున్నారు. అధికంగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. బాద్రపద బహుళ పక్ష ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. అంతరాలయం నుంచి భక్తులకు దర్శనమయ్యేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక చర్యలు చేపట్టగా, భక్తులకు క్యూలైన్ల నుంచి దర్శనానికి వచ్చేంతవరకు ఇబ్బందులు లేకుండా ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు తగిన చర్యలు చేపట్టారు. ఇక భక్తులు స్వామికి మొక్కులు చెల్లించే క్రమంలో కొందరు తలనీలాలాను సమర్పించుకోగా.. మరికొందరు ఇంద్ర పుష్కరిణి వద్ద ప్రత్యేక సంప్రదాయక పూజలు చేసి ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఆలయం తరఫున భక్తుల కోసం ఉచిత ప్రసాదాలను, మంచినీటిని పంపిణీ చేశారు. జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు, అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యేలూ.. 30 రోజుల హామీ ఏమైంది?

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్


ఎం.వి.స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును 30 రోజుల్లో పూర్తిచేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన శ్రీకాకుళం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్ ఇచ్చిన హామీ ఏమైందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ ప్రశ్నించారు. 30 రోజులు కాదు వందరోజుల పాలన పూర్తయినా నేటికీ ఆ రోడ్డుకి అతీగతిలేకుండా పోయిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికార దాహంతో నోటికొచ్చిన హామీలు ఇచ్చి.. అధికారం చేతికొచ్చాక ఎంజాయ్ చేయడం కాదు పాలనంటే అన్నారు. మాటిచ్చామంటే దానికి కట్టుబడి పనిచేయాలన్నారు. మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తామని కూటమి నాయకులు చెప్పి తట్టెడు మట్టి కూడా వేయకపోవడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల పాలనంతా మోసం, అబద్ధాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపించారే తప్ప పాలనపై ఏమాత్రం దృష్టిసారించలేదని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. విజయవాడలో వరదలు వస్తే విరాళాల పేరుతో రూ. కోట్లు దండుకుంటున్నారు తప్పితే బాధితులకు ఎక్కడా సాయమందించిన పరిస్థితి లేదన్నారు.

వరద బాధితులకు మిత్ర అకాడమీ సాయం


నిత్యావసర సరుకులతో వెళ్లే వాహనాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయవాడ వరద బాధితులకు మిత్ర అకాడమీ నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకరమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు అన్నారు. ఎంతోమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్‌నిస్తున్న అకాడమీ వారు ఇటువంటి సాయం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిత్యావసరాలు తీసుకెళ్లే వాహనాన్ని జగన్మోహన్‌రావు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. మిత్ర అకాడమీ డైరెక్టర్ మజ్జి అప్పల సూర్యనారాయణ వారి సౌజన్యంతో ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర వస్తువుల వాహనాన్ని పంపించారు. కార్యక్రమంలో మజ్జి అప్పలసూర్యనారాయణ, జ్యోతిబాపూలే ఆలిండియా అసోసియేషన్ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రెటరీ రౌతు శంకరరావు, శీర సత్యనారాయణ, మదన్ ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రౌతు సుమతి, మోహనరావు, తులగాపు ఝాన్సీ ఉన్నారు.

కేసు నమోదు


రణస్థలం: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ సమీర్ అనే వ్యక్తి గో వధ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు జే.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి ఆదివారం తెలిపారు. సమీర్ గత కొన్ని సంవత్సరాలుగా రణస్థలం, లావేరు చుట్టు పక్కల గ్రామాల్లో గోవులు కొనుగోలు చేస్తున్నాడు. అనంతరం యుబీ పరిశ్రమకు సమీపంలోని రేకుల షెడ్‌లో గోవులను వధ చేసి అమ్ముతున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి మూడు గోవులను స్వాధీనం చేసుకొని, గోశాలకు తరలించామన్నారు.

పరామర్శ..


సర్పంచ్ రాముడును పరామర్శిస్తున్న సాయికుమార్, నాయకులు

రణస్థలం: కొవ్వాడ సర్పంచ్ అల్లిపల్లి రాముడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ ఆదివారం సర్పంచ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, పార్టీ నాయకులు చిల్ల వెంకట రెడ్డి, మహంతి చినరామినాయుడు, పిన్నింటి లక్ష్మణనాయుడు, అల్లిపల్లి అప్పన్న, బడి రాంబాబు, వాసుపల్లి పండు, గణగల్ల లక్ష్మణ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్ అధికారులు అన్నారు. ఆదివారం క్యాంపస్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో విద్యార్థులు పాల్గొని పారిశుద్ధ్యం-పచ్చదనంపై అవగాహన కల్పించారు జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పెద్దింటి ముకుందరావు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా గణపతి విగ్రహాల నిమజ్జనం


ఇలిసిపురంలో గణపతి ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: గణపతి నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. నగరంలోని పలు మండపాల్లో పూజలందుకున్న వినాయక విగ్రహాలను యువకుల డీజే డ్యాన్సులు, వేషధారణలు, బాణసంచా కాల్పుల మధ్య ఆదివారం నిమజ్జనాలకు తరలించారు. కొత్త బ్రిడ్జి, పాతబ్రిడ్జి, పొన్నాడ బ్రిడ్జి, కోటేశ్వరాలయం వద్దగల రేవుల్లో విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహంగా నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


టార్గ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న విద్యార్థులు


చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ సేవా పథకం వారోత్సవాలు శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రీ యూనివర్సిటీ కోర్సు, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టగ్ ఆఫ్ వార్, చెస్, క్రాఫ్ట్, మ్యూజికల్ చైర్ వంటి ఆటలు నిర్వహించారు. క్రీడా పోటీలను డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ ప్రారంభించారు. క్రీడలను ఏఓ మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహనకృష్ణ చౌదరి పర్యవేక్షించారు.

యోగాతో మనస్సు నియంత్రణ


ప్రసంగిస్తున్న రిటైర్డ్ జడ్జి జగన్నాథం

శ్రీకాకుళం కల్చరల్: మనస్సును నియంత్రణ చేసేందుకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందని రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం అన్నారు. స్థానిక నారాయణ తిరుమలలోని యోగా కేంద్రంలో యోగాపై అవగాహన, భక్తి రంజని కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాలో ముఖ్యమైన అష్టాంగాలని వాటిని అలవరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యోగసాధకులను సత్కరించారు. అనంతరం ఆరోహి సంగీత కళశాల వ్యవస్థాపకులు పెంకి నాగేశ్వరరావు సంగీత సారథ్యంలో భక్తి గాన స్వరార్చనలో భక్తి గీతాలు, అన్నమయ్య గీతాలను గాయకులు ఆలపించారు. ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసు, జిల్లా యోగా అసోసియేషన్ ప్రతినిధి బొడ్డేపల్లి దక్షిణామూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, కొంక్యాన మురళీధర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం


కాంతారావుకు ఆర్థిక సాయం చేస్తున్న గ్రేస్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సారిపల్లి గ్రామానికి చెందిన కాంతారావు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబ పోషణ, మందులు కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రేస్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు దాసెట్టి హేమలత, కాగాపు తేజశ్వరకుమార్‌లతో పాటు మరికొంత మంది ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ. 50 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని కాంతారావుకు ఆదివారం అందించారు. కష్టకాలంలో ఆర్థిక సాయం చేసినందుకు గ్రేస్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెండవ డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు, నాన్‌స్టాప్ పోర్టికో, బస్టాండ్ ఆవరణను, ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫ్యాన్లను ఆదివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. ప్రయాణికులు వెంట తెచ్చుకున్న తినుబండారాలు తిన్న తర్వాత వ్యర్థాలను, వాటర్ బాటిళ్లను, ప్లాస్టిక్ కవర్లను చెత్తబుట్టలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రెండో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎ.గంగరాజు, ఎంఎఫ్ బి.చాణక్య, హెచ్‌సీ సూరప్పడు ఉన్నారు.

పోలీసు జాగిలాలతో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరానికి శనివారం విచ్చేసిన డీఐజీ గోపినాథ్ జట్టి గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందేనని క్రైమ్ రివ్యూలో ఆదేశించారు. ఇదే విషయమై ఎస్పీ మహేశ్వరరెడ్డి సైతం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో నగరంలో ఆదివారం పోలీసు జాగిలాలతో రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసి పలు చోట్ల తనిఖీలు జరిపారు. ఈ క్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రైవేటు ట్రావెల్స్, నాగావళి నది బ్యాక్‌సైడ్, పార్సిల్ సెంటర్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి క్రయ విక్రయాలు జరిపినా, సేవించినట్లు తెలిసిన రౌడీషీట్లు తెరవడమే కాక పీడీ యాక్టులు సైతం నమోదు చేస్తామన్నారు. యువత ఇటువంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని సీఐ హితవు పలికారు.

పుట్టపర్తిలో శ్రీకాకుళం భక్తుల భజనలు

శ్రీకాకుళం కల్చరల్: పుట్టపర్తిలో జరుగుతున్న పర్తి యాత్ర సందర్భంగా జిల్లా నుంచి సుమారు నాలుగు వేలమంది సాయి భక్తులు పాల్గొనేందుకు వెళ్లారు. అక్కడ సామూహిక భజనలు, సత్యసాయి సమాధికి హారతులు, సేవలు అందించారు. మూడు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని, ప్రతి ఏడాది శ్రీకాకుళం నుంచి భక్తులు సామూహికంగా పాల్గొంటారని రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు రామచంద్రరావులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావును స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, రాష్ట్ర సహోద్యక్షులు చింతాడ దిలీప్ కుమార్, జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య, బలివాడ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దశావతార స్తోత్రమంజరి పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో మేడూరి నర్సింగరావుచే సంకలనం చేసిన 'దశావతార స్తోత్రమంజరి' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంకలనకర్త మాట్లాడుతూ.. గ్రంథంలో పొందుపరచిన వివరాలు, సేకరణ చేసిన విధానాన్ని వివరించారు. తొలుత నర్సింహరావును మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.నారాయణమూర్తి, బి.కోమలరావు, జంధ్యాల శరత్‌బాబు, జి.విశ్వేశ్వరరావు, సంగమేశ్వరరావు, డి.జి.పట్నాయక్ ఉన్నారు.